క్లుప్తంగా

కొనసాగుతున్న అగ్నిమాపక వారోత్సవాలు



పట్నంబజార్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా ఆదివారం గుంటూరు ఫైర్ టు స్టేషన్ అధికారి పి.శ్రీనివాసరావు నేతృత్వంలో సిబ్బంది పలు అపార్ట్‌మెంట్లలో అగ్నిప్రమాద నివారణ చర్యలకు సంబంధించి డెమో నిర్వహించారు. సంగడిగుంటలోని అభినందన అపార్ట్‌మెంట్‌తో పాటు పలుచోట్ల గ్యాస్ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యల్ని వివరించారు. అనంతరం షాహీద్‌నగర్‌లో కూడా అగ్నిప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలు గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్య అన్నదాన పథకానికి విరాళం

పెదకాకాని: గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన యడ్లపల్లి హనుమంతరావు, రాజేశ్వరి దంపతుల వివాహ వేడుకను పురస్కరించుని పెదకాకాని శివాలయంలో నిత్య అన్నదాన పథకానికి ఆదివారం రూ. 1,11,116 విరాళం అందజేశారు. దాతలు, వారి కుటుంబసభ్యులకు అర్చకులు ప్రత్యేక దర్శనం చేయించారు. స్వామివారి శేషవస్త్రంతో ఘనంగా సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయంలో అన్నదాన పథకం, అభివృద్ధి పనులు, గో సంరక్షణ పథకానికి దాతలు సహాయ, సహకారాలు అందించాలని ఏసీ నల్లకాల్వ శ్రీనివాస రెడ్డి కోరారు.

ఉచిత దంత వైద్య శిబిరానికి స్పందన



పెదకాకాని: స్థానిక శివాలయం ప్రాంగణంలో గుంటూరు వారాహి డెంటల్ క్లినిక్ ఆధ్వర్యంలో శని, ఆదివారాలు ఏర్పాటు చేసిన దంత వైద్య శిబిరానికి స్పందన లభించింది. డాక్టర్ చదలవాడ చంద్రశేఖర్, డాక్టర్ యోగశ్రీ , డాక్టర్ డెభ ప్రభతా భక్తులతో పాటు గ్రామస్తులకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు మందులు ఉచితంగా అందజేశారు. ఏర్పాట్లను ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



చేబ్రోలు: ప్రమాదవశాత్తూ ఆటో, మోపెడ్ ఢీకొని ముగ్గురికి గాయాలైన సంఘటన ఆదివారం గుంటూరు బైపాస్ రోడ్డు సమీపంలో జరిగింది. అమరావతి ప్రాంతానికి చెందిన నందిగం బాబు, శివ దంపతులు మనవరాలు పద్మజతో కలసి మోపెడ్‌పై చుండూరుకు వస్తున్నారు. మార్గంమధ్యలో బుడంపాడు గ్రామ పరిధిలోని బైపాస్ రోడ్డు వద్ద ఆటో వీరు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో నందిగం శివకు తలకు, కాళ్లు, చేతులకు, బాబు, పద్మజ తలకు, ముఖానికి గాయాలయ్యాయి. బాధితుల్ని చేబ్రోలు 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మిరప కాయల చోరీపై ఫిర్యాదు

పెదకాకాని: కల్లంలో మిరప కాయల చోరీపై పెదకాకాని పోలీసులకు ఆదివారం ఓ రైతు ఫిర్యాదు చేశారు. మండలంలోని వెనిగండ్ల గ్రామానికి చెందిన నారి లక్ష్మయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఏడాది మిరప పంట సాగు చేశాడు. కోసిన మిరప కాయల్ని కల్లంలో ఆరబోశాడు. కల్లానికి కొద్ది దూరంలోనే ఇల్లు ఉండటంతో ఆదివారం రాత్రి వచ్చాడు. ఉదయం వెళ్లి చూసేసరికి సుమారు ఎనిమిది క్వింటాలు (800 కిలోలు) మిరప కాయలు మాయం అయ్యాయి. వాటి విలువ సుమారు రూ. 2 లక్షల వరకూ ఉంటుంది. కల్లంలో మిరప కాయల్ని టిక్కీల్లో పెట్టి ఆటోలో వేసుకుని వెళ్లినట్లు పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. ఆటో ఎటు వెళ్లింది అనే కోణంలో దర్యాప్తు చేపట్టారు. ఈ ఏడాది మిరపకాయల ధరలు ఆశాజనకంగా ఉండటంతో కల్లాల్లో దొంగతనాలకు పాల్పడుతున్నారని గ్రామంలో రైతులు చర్చించుకుంటున్నారు.

కుక్కల స్వైరవిహారానికి అడ్డుకట్ట

- నియంత్రణకు నగరపాలక సంస్థ పటిష్ట చర్యలు
- ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ సెంటర్‌లో ఆపరేషన్లు
- రోజుకు 30 నుంచి 40కి పైగా చేస్తున్న సిబ్బంది
- ఆపరేషన్ల అనంతరం కుక్కల సంరక్షణకు ప్రత్యేక చర్యలు



ఏటుకూరులోని ఏబీసీ సెంటర్‌లో కుక్కల షెల్టర్‌ను పరిశీలిస్తున్న మేయర్ కావటి, కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగరంలో ఏ వీధిలో చూసినా వీధి కుక్కలు స్వైరవిహారం చేస్తూ, కనిపించిన ప్రతి ఒక్కరినీ కరుస్తూ తీవ్ర భయభ్రాంతులకు గురిచేస్తున్న విషయం తెలిసిందే. రోజుకు పదుల సంఖ్యలో కుక్కల దాడిలో గాయపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. దీంతో వీధి కుక్కల నియంత్రణకు నగరపాలక సంస్థ నడుం బిగించింది. ఇందులో భాగంగా ఏటుకూరు రోడ్డులోని ఏబీసీ (యానిమల్ బర్త్ కంట్రోల్) సెంటర్‌ను ప్రారంభించింది. ఫిర్యాదులు వచ్చిన వెంటనే సదరు ప్రాంతంలో కుక్కలకు హాని జరగకుండా వాటిని పట్టుకుని ఏబీసీ సెంటర్‌కు తీసుకువెళ్లి అక్కడ ఆపరేషన్లు చేస్తున్నారు.

160 కుక్కలకు ఆపరేషన్లు

గత నెలలో గుంటూరు పరిసర ప్రాంతాల్లో ఒక్క రోజులోనే సుమారు 20 మంది కుక్కల దాడిలో గాయపడ్డారు. వీరిలో 10 మంది దాకా చిన్నారులున్నారు. దీనిపై నగరపాలక సంస్థ స్పందించింది. వీధి కుక్కల్ని అరికట్టేందుకు చర్యల్లో భాగంగా గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఫిర్యాదులు అందిన చోట నుంచి 160 కుక్కల పట్టుకొచ్చి వాటికి ఏబీసీ ఆపరేషన్లు చేయించింది.

రెండు బృందాల ఏర్పాటు

గుంటూరు నగరంలో 20వేలు కుక్కలు ఉన్నట్లు అంచనా. వీటిని పట్టుకునేందుకు నగరపాలక సంస్థ అధికారులు రెండు బృందాల్ని ఏర్పాటు చేశారు. ఒకటేమో వార్డు వైజ్‌గా, ఒకటేమో ఫిర్యాదులు వచ్చిన వెంటనే కుక్కల్ని పట్టుకునేందుకు పని చేస్తుంది. నగరంలోని 207 వార్డు సచివాలయాల పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో కుక్కల్ని గుర్తిస్తున్నారు. వాటికి తప్పనిసరిగా ఏబీసీ ఆపరేషన్లు చేయిస్తున్నారు. తరువాత వాటి సంరక్షణ కోసం, ఆరోగ్యం కుదుటపడే వరకు ప్రత్యేక సిబ్బంది పర్యవేక్షణలో జాగ్రత్తగా చూసుకునేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. కుక్కలను విడిచిపెట్టే సమయంలో ఏఆర్‌వీ (యాంటీ రేబిస్ వ్యాక్సిన్) కూడా ఇస్తున్నారు.

నిబంధనలకు అనుగుణంగా ఆపరేషన్లు

యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలకు అనుగుణంగా ఇద్దరు వెటర్నరీ డాక్టర్ల సహాయంతో కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేస్తున్నారు. ఏబీసీ సెంటర్‌లో ఇన్‌ఫెక్షన్ సోకకుండా స్టెరిలైజేషన్‌కు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. ఆపరేషన్ అయిన తరువాత కుక్కలకు ఇయర్ నాచ్ (చెవి మీద చిన్న గాటు) చేస్తున్నారు.



వీధి కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

జాగ్రత్తలతో ఏబీసీ ఆపరేషన్లు

యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియా నిబంధనలకు మేరకు వీధి కుక్కలకు ఏబీసీ ఆపరేషన్లు చేయిస్తున్నాం. ఆపరేషన్లు అయిన తరువాత డాగ్ షెల్టర్‌లో మూడు నుంచి ఐదు రోజులు ప్రత్యేక సంరక్షకుల సమక్షంలో కుక్కలు ఉంటాయి. ఇబ్బందులు కలగకుండా ఫీడింగ్, మందులు ఇస్తాం.

– డాక్టర్ భానుప్రకాష్, ఎంహెచ్ఓ

నేడు నగరపాలక సంస్థలో 'స్పందన'

నెహ్రూనగర్: స్థానిక సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమాన్ని సోమవారం ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహిస్తున్నట్లు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సచివాలయాల్లోనూ ప్రతి రోజు మధ్యాహ్నం మూడు నుంచి 5 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. అక్కడ పరిష్కారం కాని సమస్యలపై నేరుగా తమకు అర్జీలు అందజేయవచ్చని ఆమె సూచించారు.

పీఈటీ పోస్టులు భర్తీ చేయాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వ్యాయామోపాధ్యాయ (పీఈటీ) పోస్టులను భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యాయామ విద్య పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి ఎస్. బుజ్జిబాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆదివారం కొరిటెపాడు సెంటర్లోని మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వద్ద ఆయన మాట్లాడారు. సుదీర్ఘ పాదయాత్రలో వందలాది హామీల్ని ఇచ్చిన వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత వాటిని వరుసగా నెరవేర్చుతున్నారని తెలిపారు. డీఎస్సీలో క్వాలిఫైడ్ అయిన అభ్యర్థులకు పోస్టింగ్స్ ఇచ్చి న్యాయం చేశారని చెప్పారు. డీఎస్సీ ప్రకటించి, పీఈటీ పోస్టులను భర్తీ చేస్తామని ఇచ్చిన హామీని నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో సంఘ జిల్లా నాయకులు పి. గౌరీశంకర్, లక్ష్మారెడ్డి, శివరామకృష్ణ, సుబ్బయ్య, రాజేష్, గోపిరెడ్డి, నాగమణి పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగనన్న



కార్యక్రమంలో పాల్గొన్న కార్పొరేటర్ కరుణకుమారి



సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న డెప్యూటీ మేయర్ సజీల



సంక్షేమ పథకాలను వివరిస్తున్న కార్పొరేటర్ మహమూద్, కన్వీనర్లు, గృహసారథులు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఇచ్చిన హామీలన్నింటినీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి నెరవేర్చారని 25వ డివిజన్ కార్పొరేటర్ చంద్రగిరి కరుణకుమారి పేర్కొన్నారు. ఆదివారం 25వ డివిజన్ పరిధిలోని పటాన్‌చెట్టు కాలనీ, లక్ష్మీనగర్ ప్రాంతాల్లో మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాల ఫలాల్ని పొందుతున్న ప్రజలు జై జగన్ నినాదాలతో ఆనందోత్సాహాల్ని వ్యక్తం చేశారు. అనంతరం స్థానికులు ఎంతో ఇష్టంగా మా నమ్మకం నువ్వే జగన్–జగనన్నే మా భవిష్యత్ స్టిక్కర్లను వారి ఇళ్ల ముందు అతికించుకున్నారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ సూరసాని వెంకటరెడ్డి, వార్డు సచివాలయ కన్వీనర్ నాగలక్ష్మి, గృహ సారథులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం జగన్ నాయకత్వంలో సంక్షేమ పాలన

నెహ్రూనగర్: రాష్ట్రంలో సీఎం వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వంలో సంక్షేమ పాలన కొనసాగుతుందని నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల తెలిపారు. 7వ డివిజన్‌లో ఆదివారం జగనన్నే మా భవిష్యత్, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుల, మత, ప్రాంతం చూడకుండా జగన్ పాలనలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకాల్ని అందిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వార్డు ప్రెసిడెంట్ సలీం, వలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

నాలుగో డివిజన్‌లో 'మా నమ్మకం నువ్వే జగన్'

పాత గుంటూరు: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందిస్తున్నారని నాలుగో డివిజన్ కార్పొరేటర్ షేక్ మహమూద్ తెలిపారు. డివిజన్‌లోని వీరయ్య చౌదరి నగర్, మారుతీ నగర్‌లో ఆదివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ప్రభాకరరెడ్డి, గంపల నాగేశ్వరరావు, తోట మణికంట, నాగేశ్వరి, సుబ్బులు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఈద్గాల వద్ద ప్రత్యేక పారిశుద్ధ్య పనులు: మేయర్



ఈద్గాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: రంజాన్ పండుగ రోజున ప్రార్థనలు జరుపుకొనే ఈద్గాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య పనులు, మౌలిక సదుపాయాల్ని నగరపాలక సంస్థ తరపున కల్పించనున్నట్లు నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్‌నాయుడు తెలిపారు. నగరంపాలెం రోడ్డులో రమేష్ హాస్పిటల్ దగ్గరున్న ఈద్గా, పాత బస్టాండ్ ఉర్దూ బాయ్స్ స్కూలులోని ఈద్గా, పొన్నూరు రోడ్డులోని ముస్లిం కళాశాల దగ్గరున్న ఈద్గాలను ముస్లిం మత పెద్దలతో కలసి ఆదివారం ఆయన పర్యటించారు. రంజాన్ పండుగ రోజున సదరు ప్రాంతాల్లో కల్పించాల్సిన వసతులపై నగరపాలక సంస్థ ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ముందుగా ఆక్రమణలు తొలగించి, ఈద్గాలకు రంగులను కూడా వేయించి, జంగిల్ క్లియరెన్స్ చేయించాలని చెప్పారు. పండుగ రోజున వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించవద్దని, పనుల్ని త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నంబూరి సుభాని, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గులాం రసూల్, కార్పొరేటర్లు మహమ్మద్ అబీద్ బాషా, ఖాజా మొహిద్దీన్ చిష్టి, షేక్ మీరవాలి, షేక్ మహమూద్, మాజీ డెప్యూటీ మేయర్ షేక్ గౌస్, నగరపాలక సంస్థ డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, అంజుమన్ కమిటీ ప్రెసిడెంట్ మహమ్మద్ కర్నూమ, సెక్రటరీ అబ్దుల్ సలాం, ముస్లిం కళాశాల ప్రెసిడెంట్ రెహమాన్ పాల్గొన్నారు.

ఘనంగా ఈశ్వరరావు రాజకీయ రంగ స్వర్ణోత్సవ వేడుకలు



ఈశ్వరరావును సన్మానిస్తున్న రామచంద్రప్రభు, లక్ష్మణరావు, రుద్రరాజు తదితరులు

పాత గుంటూరు: నగరంపాలెంలోని యన్‌జీఓ కల్యాణ మండపంలో లయన్ నూతలపాటి వీర ప్రకాశరావు, ప్రముఖ పారిశ్రామికవేత్త తులసి రామచంద్ర ప్రభు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు రాజకీయరంగ స్వర్ణోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సభకు ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పాల్గొన్నారు. లక్ష్మణరావు మాట్లాడుతూ లింగంశెట్టి ఈశ్వరరావు రాజకీయాల్లో అందరికీ ఆదర్శప్రాయులని తెలిపారు. తులసి రామచంద్ర ప్రభు మాట్లాడుతూ ఈనాటి రాజకీయ నాయకులు ఆయన్ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈశ్వరరావుకు రజిత కిరీట ధారణ చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు షేక్ మస్తాన్ వలి, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, లయన్ ఉగ్గిరాల సీతారామయ్య, కొరివి వినయ్ కుమార్, దాసరి రాము, కాకుమాను పెద్ద పేరిరెడ్డి, కొప్పరపు రాధాకృష్ణమూర్తి, కొంజేటి వెంకట నగేష్, డాక్టర్ బెంజమిన్, ఆంజనేయులు, రామన శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కళలకు కణాచి హిందూ కాలేజీ హైస్కూలు



డిజిటల్ లైబ్రరీని ప్రారంభిస్తున్న శివరామకృష్ణ ప్రసాద్

గుంటూరు ఎడ్యుకేషన్: బోధనతో పాటు ఎంతో మంది విద్యార్థుల్ని కవులు, కళాకారులుగా తీర్చిదిద్దిన హిందూ కాలేజీ హైస్కూలు కళలకు కాణాచి వంటిదని ఆ పాఠశాల కార్యదర్శి కేఎస్సార్ కుటుంబరావు పేర్కొన్నారు. మార్కెట్ సెంటర్లోని హిందూ కాలేజీ హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కుటుంబరావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక విజ్ఞానం మేళవించి బోధన చేస్తే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని చెప్పారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన డిజిటల్ లైబ్రరీని పాలకవర్గ అధ్యక్షుడు గబ్బిట శివరామకృష్ణ ప్రసాద్ ప్రారంభించారు. విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా విద్యను నేర్చుకొని ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆయన సూచించారు. వార్షికోత్సవ సభకు ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీకే సురేష్ మాట్లాడుతూ విద్యార్థులంతా కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హైస్కూలు పూర్వ విద్యార్థి డాక్టర్ చంద్రశేఖర్, పూర్వ ప్రధానోపాధ్యాయుడు ఎం.ఎల్.ఎన్. మూర్తి, ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు మరవరానివి



గాయకుడు సుధాకర్, ప్రవీణ్‌కుమార్, భావనా చౌదరిలను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

తెనాలి అర్బన్: ఎన్టీఆర్ సేవలు మరవరానివని బొప్పన ప్రవీణ్ కుమార్, గుమ్మడి భావన చౌదరి పేర్కొన్నారు. నందమూరి తారక రామారావు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం ఆయన వ్యక్తిత్వంపై కొత్తపేటలోని పెన్షనర్ అసోసియేషన్ హాలులో చర్చ నిర్వహించారు. బహుజనుల కోసం ఎన్టీఆర్ తీసుకువచ్చిన సంస్కరణలపై ప్రవీణ్ కుమార్, భావన చౌదరి ప్రసంగించారు. అనంతరం ప్రముఖ గాయకుడు మామిడి వెంకట సుధాకర్‌తో పాటు వక్తల్ని సన్మానించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పనేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, శ్రీకరరావు, ఉప్పు సత్యనారాయణ, పరుచూరి రమ్య, సత్యవతి, సుజాత, సరోజా లక్ష్మి, నాగమణి, గుమ్మడి వాణి, కంచర్ల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

అపోపా ఆధ్వర్యంలో పేదలకు పెన్షన్లు పంపిణీ



ఆర్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్‌ను సత్కరిస్తున్న అపోపా ప్రతినిధులు

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట 7వ లైనులోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అపోపా) కార్యాలయంలో ఆదివారం వృద్ధులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అపోపా అధ్యక్షుడు కె.వి.బ్రహ్మం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి సాధు ప్రతాప్ మాట్లాడుతూ ప్రతినెలా 100 మందికి రూ.500 చొప్పున పెన్షన్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ప్రముఖ పారిశ్రామికవేత్త కె. కిరణ్ కౌశిక్ మాట్లాడుతూ ప్రతి నెలా 30 మంది పేదలకు పెన్షన్ ఇవ్వడంతో పాటు రూ.రెండు లక్షల ఉపకార వేతనాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దేవస్థానం బోర్డు సభ్యుడు మువ్వల నరిసింహచెట్టి మాట్లాడుతూ అపోపా సామాజిక సేవల్ని ప్రశంసించారు. అనంతరం డాక్టర్ కె. రామలింగేశ్వరరావు రోగుల్ని పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అపోపా కార్యదర్శి వెచ్చా రాధాకృష్ణయ్య, కోశాధికారి మహంకాళి శ్రీనివాసరావు, లింగమల్లు రమేష్, నిడమానూరి సురేష్ పాల్గొన్నారు.

దర్శకుడు రేలంగి నరసింహారావుకు పురస్కారం



పురస్కార గ్రహీతలతో నిర్వాహకులు

పాత గుంటూరు: కొరిటెపాడు ఎల్‌వీఆర్ క్లబ్ రీడింగ్ రూం వేదికగా కేఆర్‌కే ఈవెంట్స్, కళావిపంచి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం పద్మశ్రీ అల్లురామలింగయ్య శత జయంతి పురస్కరించుకొని తెలుగు నాటక రంగస్థల పురస్కారాల సభ నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు పాములపాటి శ్రీనివాసరావు జ్యోతి ప్రకాశనం చేసి కార్యక్రమాల్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా నటుడు పలమాని శ్రీనివాసరావు, ఎన్టీఆర్ కళాపరిషత్ గౌరవాధ్యక్షుడు అంబటి మధుమోహన కృష్ణ, ఉపాధ్యక్షుడు జి.చంద్రశేఖర్, రంగస్థల నటుడు డాక్టర్ దేవరపల్లి ప్రభుదాస్, పౌరాణిక కళాకారుల అధ్యక్షుడు నల్లక శ్రీనివాసరావు పాల్గొన్నారు. ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావుకు అల్లురామలింగయ్య ఆత్మీయ పురస్కారం, రంగస్థల నటుడు మువ్వా పెద బాపిరెడ్డికి రంగస్థల పురస్కారాన్ని అందించి ఘనంగా సత్కరించారు. అనంతరం హ్యూమర్ క్లబ్ హాస్య వల్లరి ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. కార్యక్రమాల్ని కాట్రగడ్డ రామకృష్ణ ప్రసాద్, అధ్యక్ష, గౌరవాధ్యక్షులు బొప్పన నరసింహారావు, రామరాజు శ్రీనివాసరావు, జి.మల్లికార్జునరావు, డి. తిరుమలేశ్వరరావు, జీవీజీ శంకర్ పర్యవేక్షించారు.

క్రైం కార్నర్

యువతి అదృశ్యం



రమ్యకృష్ణ

గుంటూరు ఈస్ట్: యువతి అదృశ్యంపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... విద్యానగర్ 1వ లైనుకు చెందిన రాజేంద్రబాబు కుమార్తె కె.రమ్యకృష్ణ (30) శనివారం ఇంట్లో ఎవరికి చెప్పకుండా ఎటో వెళ్లి పోయింది. ఆమె ఆచూకీ కోసం వెతికి, కనిపించకుండా పోయినట్లు నిర్ధారించుకున్న కుటుంబ సభ్యులు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫోటోలోని మహిళను గుర్తించిన వారు 8688831332కు సమాచారం ఇవ్వాలని కోరారు.

దాడిపై కేసు నమోదు

వ్యక్తిపై దాడి ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడికొండకు చెందిన షేక్ అబ్దుల్లా గుంటూరులోని ఉల్ఫా హాల్ సెంటర్‌లో ఆటోలో కూర్చుని ఉండగా చంద్రకాంత్ అతడితో పాత కక్షల నేపథ్యంలో గొడవపడ్డాడు. అబ్దుల్లాని చంద్రకాంత్ కొట్టి గాయపరిచాడు. వైద్య చికిత్స అనంతరం ఆదివారం అబ్దుల్లా పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

నాలుగో అంతస్తు నుంచి కిందపడి పెయింటర్ మృతి

ఓ పెయింటర్ నాలుగో అంతస్తు నుంచి కింద పడి మృతి చెందిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రాజ్‌కుమార్‌శర్మ (27) శ్యామలానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న అపార్టుమెంటు 4వ అంతస్తులో పెయింట్ పనులు చేస్తూ ప్రమాదవశాత్తు కాలు జారి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పట్టాభిపురం పోలీసులు కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మతోన్మాద బీజేపీని సాగనంపాలి: సీపీఎం



ప్రచారంలో పాల్గొన్న సీపీఎం నేతలు

పెదకాకాని: ప్రజా వ్యతిరేక, నిరంకుశ మతోన్మాద బీజేపీని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సీపీఎం మండల కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపునిచ్చారు. పెదకాకాని సుందరయ్య కాలనీలో ఆదివారం ప్రచార భేరి కరపత్రాల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివాజీ మాట్లాడుతూ మన రాష్ట్రానికి మోదీ ప్రభుత్వం చేస్తున్న ద్రోహం అంతా ఇంత కాదని తెలిపారు. ప్రత్యేక హోదా, పోలవరానికి నిధుల మంజూరు, రాజధాని నిర్మాణం, రైల్వే జోన్, రాయలసీమ ఉత్తరాంధ్ర ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ.. ఇవన్నీ పార్లమెంటు సాక్షిగా విభజన చట్టంలో ఇచ్చిన హామీలేనని పేర్కొన్నారు. ఇందులో ఏ ఒక్కటీ అమలు చేయలేదని విమర్శించారు. రాష్ట్రానికి ఆయువుపట్టు లాంటి విశాఖ ఉక్కు జిందాల్ ఆదానీకి కట్టబెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీన్ని అడ్డుకోవడంలో ప్రాంతీయ పార్టీలు విఫలమయ్యాయని విమర్శించారు. రైల్వే, టెలికాం బ్యాంకులు, ఓడరేవులు, గనులు ప్రైవేటు వాళ్లకి దోచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. పెట్రోల్ డీజిల్ గ్యాస్ నిత్యవసర వస్తువులు విపరీతంగా పెరిగాయని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బురదగుంట సాంబయ్య, కె. రాఘవయ్య, ఎ. నాగేశ్వరరావు, శామ్యేల్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

కార్మెల్ మాతకు భక్తుల పూజలు

ఫిరంగిపురం: కార్మెల్ మాతను దర్శించుకునేందుకు ఆదివారం పెద్దఎత్తున భక్తుల తరలివచ్చారు. ఉదయాన్నే కడప, ఆళ్లగడ్డ, అనంతపురం, రాజోలు, వెంకటాయపాలెం ప్రాంతాల నుంచి రైళ్లు, వాహనాల్లో వచ్చి కొండ ఎక్కారు. అమ్మవారికి తలనీలాలు సమర్పించారు. కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరి కాయలు కొట్టి మొక్కలు చెల్లించుకున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్ని బలోపేతం చేయాలి

మంగళగిరి: ప్రభుత్వ ఆసుపత్రుల్ని బలోపేతం చేయడానికి పాలక పార్టీలు కృషి చేయాలని ప్రజారోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కేవీఎస్ సాయి ప్రసాద్ కోరారు. నగరంలోని గోపాలకృష్ణ థియేటర్ సమీపంలోని ఆస్పత్రిలో ప్రజారోగ్య వేదిక రాష్ట్ర సావనీర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సాయి ప్రసాద్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం గురించి పాలక పార్టీలు పట్టించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజారోగ్య వేదిక మంగళగిరి డివిజన్ నాయకులు డాక్టర్ వంశీకృష్ణ, విజయ్, ఎం.నాగేశ్వరరావు, రాజేష్, వివిధ ప్రజా సంఘాల నాయకులు జేవీ రాఘవులు, ఎస్ఎస్ చెంగయ్య, పి.బాలకృష్ణ, ఎస్.గణేష్ పాల్గొన్నారు.